క్లుప్తంగా

రేపు వెంకన్న ఆలయ వార్షికోత్సవం

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు వెంకటేశ్వరనగర్‌లోని శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయ 11వ ఏకాదశ వార్షిక కల్యాణోత్సవం ప్రముఖ న్యాయవాది, గొందేశి పూర్ణచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు గొందేశి శ్రీనివాసులు రెడ్డి పర్యవేక్షణలో శనివారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉత్సవ కమిటీ సభ్యులు గురువారం ప్రకటన విడుదల చేశారు. ఆరోజు ఉదయం 8 గంటలకు స్వామివారికి విశేష పూర్ణాభిషేకం, 10 గంటలకు సుదర్శన హోమం, మధ్యాహ్నం అన్నసమారాధన, సాయంత్రం 5 గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం జరుగుతాయి. కల్యాణం చేయించుకునే దంపతులు ఆలయ కమిటీని సంప్రదించాలి. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు స్వామివారి పల్లకీ ఊరేగింపు నిర్వహిస్తారు.

ముగిసిన బైబిలు మిషను మహాసభలు



ప్రార్థన చేస్తున్న పాస్టర్లు

రాజమహేంద్రవరం రూరల్: ఏసుక్రీస్తు బోధనలను ఆచరించి, ప్రపంచ శాంతికి ప్రతిఒక్కరూ పాటుపడాలని ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు రెవరెండ్ బిషప్ కె.ప్రతాప్ సిన్హా అన్నారు. మార్గాని ఎస్టేట్ ఆవరణలో మూడు రోజులు జరిగిన బైబిలు మిషను 56వ మహాసభలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరైన దైవ ప్రసంగం చేశారు. రెవరెండ్ సుధీర్ కుమార్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వచ్చిన భక్తులకు మహాసభల నిర్వాహకులు, కన్వీనర్ ఎస్‌జే షారోన్ కుమార్, కోకన్వీనర్, పాస్టర్ ఎస్.సుదన్ షారోన్, టి.రతన్ రాజు, సుదర్శన్ షాపింగ్ మాల్ అధినేత లావేటి సుదర్శన్ తదితరులు భోజనం, వసతి సౌకర్యాలు కల్పించారు.

నిర్మాణ రంగానికి నిధులు శూన్యం

ప్రకాశం నగర్: బడ్జెట్‌లో భవన నిర్మాణ రంగానికి నిధుల కేటాయింపులు శూన్యమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఆర్థిక మంత్రి బుగ్గన రాజమహేంద్రవరంలో టూరిజం అభివృద్ధికి కృషి చేయలేదన్నారు. విశాఖ నుంచి నెల్లూరు తడ వరకు సాగరమాల ప్రాజెక్ట్‌కు కేటాయింపులు లేవన్నారు.

వైభవంగా పునఃప్రతిష్ఠాపనోత్సవాలు



ఉత్సవమూర్తులు

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడు గ్రామంలో ఒనువులమ్మ ఆలయ పునఃప్రతిష్ఠాపనోత్సవాలు గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులు జరిగే ఈ కార్యక్రమాల్లో భాగంగా గురువారం ఉదయం ఆలయం పక్కనే గల హోమశాలలో విఘ్నేశ్వర పూజతో మొదలై దీక్షాధారణ, అగ్ని ప్రతిష్ఠాపనం, ధ్వజారోహణం, ప్రసాద వితరణతో ముగిశాయి. మధ్యాహ్నం ఉత్సవ మూర్తులకు జలాధివాసం అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

ఆవిర్భావ దినోత్సవం విజయవంతం

ప్రకాశం నగర్: జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం విజయవంతమైందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనసేన వెంట ప్రజలు ఉన్నారన్నారు. పవన్ కల్యాణ్ సభలకు వస్తున్న జనమే ఇందుకు నిదర్శనం అన్నారు. సమావేశంలో రాజానగరం ఇన్‌చార్జి మేడా గురుదత్త ప్రసాద్, అనపర్తి ఇన్‌చార్జి మరేడి శ్రీను, రాజమహేంద్రవరం నగర ఇన్‌చార్జి అను శ్రీ సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి ప్రియ సౌజన్య పాల్గొన్నారు.

సచివాలయాలకు ఆదాయం పెంచాలి

పెదపూడి: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలతో గ్రామ సచివాలయాలకు అదనపు ఆదాయం పెంచడానికి కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఈఓపీఆర్డీ కె.హరికృష్ణ సత్యరెడ్డి అన్నారు. కాండ్రేగుల గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా హరికృష్ణ సత్యరెడ్డి మాట్లాడుతూ వర్మీ కంపోస్టు ఎరువు రైతులకు నిబంధనల ప్రకారం విక్రయించాలన్నారు. వివిధ రకాల పండ్ల మొక్కలు, కొబ్బరి, అరటి, బీర, ఆనప మొదలైన కాయ, ఆకు కూరలు పండించి సచివాలయానికి అదాయం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కేవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

రోడ్డు అధ్వానం.. ప్రయాణం కష్టం..

- శిథిలమైన కాటన్ బ్యారేజీ రోడ్డు
- రాకపోకలకు అవస్థలు



గతుకుల మయంగా మారిన కాటన్ బ్యారేజీ రోడ్డు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీపై రోడ్డు గతుకులమయంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వేల మంది రాకపోకలు సాగించే కాటన్ బ్యారేజీ రోడ్డు నిర్వహణపై అధికారులు దృష్టి సారించాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు. కాటన్ బ్యారేజీ రోడ్డు 5.83 కిలోమీటర్లు విస్తరించింది. మెత్తం నాలుగు ఆర్మ్‌ల పరిధిలో 3.599 కిలోమీటర్ల మేర బ్యారేజీ రోడ్డు, 2.23 కిలోమీటర్లు మేర లంక రోడ్లు ఉన్నాయి. ఇందులో బొబ్బర్లంక కోనసీమ జిల్లా పరిధిలో ఉంది. కోనసీమ జిల్లాకు సంబంధించి అక్కడ కలెక్టర్ రూ.23 లక్షలు స్పెషల్ ఫండ్ రిలీజ్ చేయడంతో రోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు. దీంతో సుమారు 40 శాతం వరకు పనులు జరగనున్నాయి. మిగిలిన ప్రాంతం తూర్పుగోదావరి జిల్లాలో ఉంది. ఈ పనులు జరగకపోవడంతో రోడ్డు గతుకులమయంగా మారింది. నిత్యం అనేకమంది రైతులు అరటి గెలలు, అరటి ఆకులు, కొబ్బరి బొండాలు లోడులతో ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు.

ప్రత్యేక దృష్టి సారించాలి

కాటన్ బ్యారేజీ రోడ్డు అధ్వానంగా మారడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. దీనికి తోడు గోతుల కారణంగా వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని బ్యారేజీ రోడ్డుకు వెంటనే పనులు ప్రారంభమయ్యేలా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

రూ.2 కోట్లతో ప్రతిపాదనలు

కాటన్ బ్యారేజీపై రోడ్డు పూర్తిస్థాయి నిర్మాణానికి రూ.2 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాం. కోనసీమ పరిధిలో కలెక్టర్ స్పెషల్ ఫండ్ ద్వారా పనులు జరుగుతున్నాయి.

– జి.శ్రీనివాసరావు, ఎస్ఈ, ఇరిగేషన్ సర్కిల్, ధవళేశ్వరం

డ్రిప్ కోసం ఎదురుచూపులు

కాటన్ బ్యారేజీ ఆధునీకరణకు సంబంధించి కేంద్రం నుంచి డీఎస్సార్పీ బృందం గత సంవత్సరం జనవరి 5న బ్యారేజీని సందర్శించింది. దీనిపై అప్పట్లో డ్యామ్ రీహేబిలిటేషన్ , ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం (డ్రిప్)లో ప్రపంచ బ్యాంక్ రుణంతో ఆధునీకరణ పనులు ప్రారంభమవుతాయని ఎదురు చూశారు. ఇప్పటివరకు డ్రిప్‌కు సంబంధించి ఎటువంటి సమాచారం లేకపోవడంతో స్థానిక నిధులతో పనులు నిర్వహిస్తున్నారు.

బొమ్మూరు నేతాజీనగర్‌లో చోరీ



చోరీ జరిగిన బీరువా

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు నేతాజీనగర్ ఆరోవీధికి చెందిన కేంద్రప్రభుత్వ విశ్రాంత ఉద్యోగి ఉప్పల వెంకట కృష్ణారావు, భార్య, తల్లితో కలిసి ఉంటున్నారు. బుధవారం రాత్రి ఆయన యథాతథంగా హాలులో నిద్రపోగా, తల్లి, భార్య మరో గదిలో పడుకున్నారు. గురువారం ఉదయం లేచేసరికి ఇంటి మరో పడకగదిలో కిటికీ గ్రిల్స్ తొలగించి ఉన్నాయి. పరిశీలించగా బీరువాలోని 179 గ్రాముల బంగారం, 100 గ్రాముల వెండివస్తువులు, రూ.10 వేలు మాయమయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆర్.విజయకుమార్, ఎస్సై శివాజీ పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీమ్ వేలిముద్రలను సేకరించింది. ఈ మేరకు బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

రాజానగరం: నులి పురుగుల నివారణలో భాగంగా దివాన్ చెరువులోని వీజేస్ ఫార్మసీ కాలేజీలో విద్యార్థులకు గురువారం ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. శరీరంలో నులి పురుగులు ఉండటం వలన పోషకాహార లోపంతోపాటు రక్తహీనత, నీరసం, మానసిక రుగ్మతలు ఏర్పడతాయని హెల్త్ అసిస్టెంట్ పి.పుల్లారావు ఏఎన్ఎం సుభాషిణి వివరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎస్‌వీవీ జగన్‌మోహన్‌రెడ్డి, చైర్‌పర్సన్ ఎన్.శకుంతల, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.నరేంద్ర, ఎన్‌సీసీ పీఓ కిషోర్ పాల్గొన్నారు.

భోజనం ప్యాకెట్ల వితరణ

సీతానగరం: చినకొండేపూడిలోని షిర్డీ సాయిబాబా వసతి మందిరం ఆధ్వర్యంలో దాత చిడిపి శ్రీను సహకారంతో గురువారం నిరుపేదలకు భోజనం ప్యాకెట్లు అందజేశారు. సుమారు 150 మంది పేదల ఇళ్లకు వెళ్లి మందిరం సేవాసమితి సభ్యులు అందజేశారు.

సంక్షేమమే లక్ష్యంగా జగన్ పాలన

- అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు
- వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు శ్రీహరి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి

రాజమహేంద్రవరం సిటీ: ప్రజలందరి సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి అన్నారు. క్షేత్రస్థాయిలో పేదలందరికీ పథకాలు అందించడమే ఆయన ప్రధాన ఆశయమన్నారు. దానిని నెరవేర్చేందుకు మనమందరం కలసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక 24వ డివిజన్‌లో గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు, శ్రేణులు, గృహసారథులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి జగన్ సంక్షేమ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. గృహసారథులు ఏకుటుంబానికి సంక్షేమ పథకాలు అందాయి, ఇంకా ఎవరికి అందలేదనే విషయంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. 2024 ఎన్నికల్లో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో క్లస్టర్ ఇన్‌చార్జి కొత్త విజయరాజ్యలక్ష్మి, మాజీ కార్పొరేటర్ బెజవాడ రాజ్‌కుమార్, పార్టీ నాయకులు అరవ సురేష్, మద్దు సతీష్, అందనాపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎన్నో రోగాలకు దివ్యఔషధం యోగా



బ్రహ్మకుమారి మంజులాదీదీని సత్కరిస్తున్న రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి తదితరులు

సీటీఆర్ఐ: ఎన్నో రోగాలకు దివ్య ఔషధంగా యోగా పనిచేస్తుందని రాజస్థాన్‌లోని మౌంట్ అబూ నుంచి వచ్చిన రాజయోగిని బ్రహ్మకుమారి మంజులాదీదీ అన్నారు. సీటీఆర్ఐ సమీపంలోని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం నగర శాఖ కార్యాలయంలో గురువారం సంస్కార పరివర్తనా యోగబట్టి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవ జీవితాలలో సంస్కార పరివర్తనా తీసుకురావడానికి దేశమంతా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. యోగబట్టి సంస్థ ఇన్‌చార్జి బీకే గీతామాధురి మాట్లాడుతూ నేటి ఉరుకుల పరుగులు జీవితంలో ప్రతి ఒక్కరూ మానసిక ప్రశాంతతను కోల్పోతున్నారన్నారు. యోగాను జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. నగర శాఖలో ప్రతి రోజూ జరిగే తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు గుత్తుల మురళీధర రావు, డాక్టర్ కోమలి, సుంకర సూర్యప్రకాశ రావు పాల్గొన్నారు.

బీసీ సంఘాన్ని మరింత బలోపేతం చేస్తాం

- 25న చలో రాజమహేంద్రవరం
- రాష్ట్ర కోఆర్డినేటర్ దుర్గానరేష్ యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న దుర్గానరేష్ యాదవ్

సీటీఆర్ఐ: జాతీయ బీసీ సంక్షేమ సంఘాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలన్న డిమాండ్‌తో ఈనెల 25వ తేదీన హలో బీసీ.. చలో రాజమహేంద్రవరం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్, స్టేట్ ఇన్‌చార్జి బోను దుర్గానరేష్ యాదవ్ వెల్లడించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆహ్వాన పత్రికను బీసీ సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ నరవ గోపాలకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగుల సూర్యారావు, మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు బర్ల సీతారత్నంతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి బీసీ నాయకులు పెద్దఎత్తున హాజరవుతున్నారన్నారు. ప్రస్తుతం బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్న రాయుడు రాకేష్‌ను యువజన విభాగం రాష్ట్ర కో ఆర్డినేటర్‌గా నియమించామని, ఆయన ఆ కార్యక్రమంలో కృష్ణయ్య సమక్షంలో ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. సమావేశంలో రాయుడు శ్రీను, రుక్మాంగధరావు, బూడిద శరత్‌కుమార్, దీపు, పిల్లి ఉపేంద్ర పాల్గొన్నారు.

‘అప్పు తీసుకుని చెల్లించడం లేదు’

కడియంలో పలువురి ఆందోళన

కడియం: మండల కేంద్రమైన కడియంలో ఉన్నత పాఠశాల వెనుకవైపున గల జయరామ్ ఎలక్ట్రికల్స్ యజమాని కొప్పిశెట్టి జయరామ్ తమ వద్ద అప్పు తీసుకుని, తిరిగి ఇమ్మంటే దుర్భాషలాడుతూ దౌర్జన్యం చేస్తున్నాడని పలువురు బాధితులు గురువారం రాత్రి ఆందోళనకు దిగారు. వీరిలో ఎక్కువ మంది అతడి బంధువులే ఉండడం గమనార్హం. వివరాల్లోకి వెళితే.. కడియపుసావరం గ్రామానికి చెందిన జయరామ్ కడియంలో జయరామ్ ఎలక్ట్రికల్స్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. పలువురి వద్ద ఇతడు భారీ ఎత్తున అప్పులు తీసుకున్నాడు. భారీ షాపింగ్ కాంప్లెక్స్‌లో పెద్ద ఎత్తున వ్యాపారం నిర్వహించే అతడిని చూసి మండలంలోని పలువురు, అతడి బంధువులు కూడా అప్పులు ఇచ్చారు. కొన్నాళ్లు బాగానే సాగిన ఈ వ్యవహారం తిరిగి అప్పులు చెల్లించకపోవడంతో ఇప్పుడు రోడ్డున పడింది. ఇటీవల తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని రుణదాతలు ఒత్తిడి చేస్తున్నారు. కానీ జయరామ్ డబ్బులు ఇవ్వకుండా వాయిదాలు వేస్తున్నాడు. పలువురి పెద్దల్లో ఇప్పటికే పలు పంచాయతీలు కూడా అయ్యాయి. దీంతో గురువారం రాత్రి డబ్బులు అడిగేందుకు మరోమారు షాపు వద్దకు భారీ ఎత్తున రుణదాతలు చేరుకున్నారు. అడిగితే తమపై జయరామ్ తదితరులు దుర్భాషలాడుతూ, దౌర్జన్యానికి దిగారని బాధితులు తెలిపారు. ఈ నేపథ్యంలో పోలీస్‌లకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు.

బాధితులతో పోలీసుల చర్చలు

రుణాలు ఎగవేసే ఉద్దేశంతోనే సదరు వ్యక్తి ఉన్నాడని బాధితులు చెబుతున్నారు. అతడి పేరిట ఎటువంటి ఆస్తులు లేకుండా ముందు జాగ్రత్తగా బంధువుల పేరిటకు మార్చివేశాడని ఆరోపిస్తున్నారు. ఆందోళన నేపథ్యంలో పోలీసు సిబ్బంది అక్కడకు చేరుకుని బాధితులతో చర్చిస్తున్నారు. బాధితుల్లో కొప్పిశెట్టి నాగలక్ష్మి రూ. 23 లక్షల అప్పుగా ఇచ్చింది. దూనబోయిన జ్యోతి, గుబ్బల సత్యనారాయణ, పిల్లి సత్యవతి, దుంగల వెంకటరమణ, దూనబోయిన జ్యోతి, దూనబోయిన సంజయ్, తోట వెంకటరమణ, కానుబోయిన సత్యనారాయణ, కానుబోయిన ధైర్యలక్ష్మి, ఎల్.సత్యనారాయణ, కొప్పిశెట్టి సూర్యకాంతం తదితరులు తమకు డబ్బులు ఇవ్వాలని చెబుతున్నారు. ఇదిలా ఉండగా బాధితుల ఆందోళన నేపథ్యంలో జయరామ్ అందుబాటులో లేకపోవడంతో అతడి సోదరుడు శ్రీనివాస్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బాధితులు కూడా స్టేషన్‌కు తరలివచ్చారు. ఇదిలా ఉండగా బాధితులంతా తమపైనే దౌర్జన్యం చేశారని జయరామ్ కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయం

- కొనియాడిన వక్తలు
- ఘనంగా జయంత్యుత్సవం



కడియంలో శ్రీరాములు చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న గిరజాల వీర్రాజు తదితరులు



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఏఎస్పీ వెంకటేశ్వరరావు



రుడా కార్యాలయంలో నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి



నగర పాలక సంస్థ కార్యాలయంలో జయంతి నిర్వహిస్తున్న అదనపు కమిషనర్ సత్యవేణి



తెలుగువిశ్వవిద్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంత్యుత్సవం

కడియం: ఆంధ్ర రాష్ట్రం కోసం అశువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్ సీపీ రాష్ట్రకార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు) అన్నారు. అమరజీవి జయంతిని గురువారం కడియంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి శ్రీరాములు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. శివాలయం చైర్మన్ ఆర్ఎస్ఎన్ మూర్తి, మండల ఆర్యవైశ్య సంఘం సభ్యులు చక్కా కాశీ, గ్రంధి నాగేశ్వరరావు, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు దొడ్డా బుజ్జి, పార్టీ నాయకులు గుత్తుల వాసు, కందా రాజు, కడియం గణేష్, మంగు వరప్రసాద్, బొమ్మిరెడ్డి సత్తిబాబు, కడియం గంగారావు, వాసు, రమేష్ పాల్గొన్నారు.

త్యాగధనుడు శ్రీరాములు

కడియం: భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం ప్రాణాలు అర్పించిన త్యాగధనుడు పొట్టి శ్రీరాములు అని ఎంఈవో వి.లజపతిరాయ్ అన్నారు. శ్రీరాములు జయంతిని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈవోపీఆర్డీ లక్ష్మి నేతృత్వంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. జేసీ త్రిమూర్తులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాస రావు, న్యాయవాది గుమ్మడి రత్నంరాజు, విజయ్, జయపతి, శ్రావ్య పాల్గొన్నారు.

- వేమగిరి కొండపైగల బుద్ద విహారాలో పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. మహోదయ యాజరా ఆధ్వర్యంలో స్థానికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బొమ్మూరులో..

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని సాహిత్య పీఠంలో పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.రామకృష్ణ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు, తెలుగుతల్లి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాహిత్యపీఠం సూపరింటెండెంట్ జగన్నాథం పాల్గొన్నారు.

- బొమ్మూరులోని రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో శ్రీరాములు చిత్రపటానికి తహసీల్దార్ పైడి చిన్నారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఎస్‌వో పి.రామం, వీఆర్‌వోలు, తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు. కాతేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని సుజాత పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

కంబాలచెరువు: జిల్లా పోలీసు కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి అడిషనల్ ఎస్పీలు జి.వెంకటేశ్వరరావు, డి.శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆర్ఐలు సంజీవ్ కుమార్, నరసింగరావు, చంద్రశేఖర్ మినిస్టీరియల్ స్టాఫ్, సిబ్బంది పాల్గొన్నారు

- స్థానిక జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి కార్యాలయ ఏడీలు సుబ్బారావు, ఛాయాదేవి, డీవైఈవో ఎం.తిరుమలదాస్‌లు పుష్పాంజలి ఘటించారు. అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు పొట్టి శ్రీరాములు చేసిన త్యాగమే కారణమన్నారు.
- స్థానిక వ్యవసాయ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ సీహెచ్.శ్యామ్ రాజ్ నాయక్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎస్.హైమజ్యోతి, డాక్టర్ కె.రవికుమార్ పాల్గొన్నారు.

మహోన్నతుడు పొట్టి శ్రీరాములు

రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణాలు అర్పించిన పొట్టి శ్రీరాములు మహోన్నతుడు అని రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి అన్నారు. రుడా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రుడా సెక్రటరీ శైలజావల్లి, జేపీఓ రాజకుమారి ఏపీవో అనిత, ఈవో శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.

- రాజమహేంద్రవరం నగరపాలకసంస్థ కార్యాలయంలో అమరజీవి చిత్రపటానికి అడిషనల్ కమిషనర్ సత్యవేణి పూలమాల వేసి నివాళులర్పించారు. డిప్యూటీ కమిషనర్ జి.సాంబశివరావు, మేనేజర్ ఎండీ అబ్దుల్ మాలిక్ అస్ఫర్, రెవెన్యూ ఆఫీసర్ సీహెచ్ శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్ పి.రామారావు పాల్గొన్నారు.

నేడు బిక్కవోలు గోలింగేశ్వరస్వామి కల్యాణం



బిక్కవోలు: బిక్కవోలు ఉమా పార్వతీ సమేత గోలింగేశ్వర స్వామి కల్యాణం శుక్రవారం జరుగుతుందని ఆలయ ఈవో రామలింగ భాస్కర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ కల్యాణానికి సకల ఏర్పాట్లు పూర్తయ్యాయని, శుక్రవారం తెల్లవారుజాము నుంచే అర్చకుల ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారని చెప్పారు.

సినిమాలు



శ్యామల	: బలగం
సూర్యమినీ	: షజామ్
సూర్యప్యాలెస్	: ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి
స్వామి	: కబ్జ
శివజ్యోతి	: కబ్జ
అనుశ్రీ	: షజామ్
రాజా	: షజామ్
అశోక	: సార్
ఊర్వశి	: గణా
రంభ	: జామ్
మేనక	: పులి
గీతాఅప్సర	: కబ్జ
నామవరం	
వీఎస్ మహల్	: కబ్జ
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: కబ్జ

వెంకన్న హుండీ ఆదాయం లెక్కింపు వాయిదా



దేవదాయ శాఖ అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న పాలకవర్గం సభ్యులు

గోకవరం: తంటికొండ వేంకటేశ్వరస్వామి దేవస్థానం హుండీల ఆదాయం లెక్కింపు వాయిదా పడింది. ఆలయంలో అక్రమాలపై విచారణ చేపట్టకుండా హుండీ ఆదాయం లెక్కించ వద్దని పాలకవర్గం సభ్యులు పట్టుబట్టారు. వివరాల్లోకి వెళితే.. దేవస్థానంలో హుండీల ఆదాయం లెక్కింపునకు గురువారం అధికారులు ఏర్పాట్లు చేశారు. కాకినాడ దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో హుండీల లెక్కింపునకు ఏర్పాట్లు చేస్తుండగా దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి రాంబాబు(రెడ్డి), ఇతర పాలకవర్గం సభ్యులు అడ్డుకున్నారు. ఆలయంలో పలు అక్రమాలు జరిగాయని, వీటిపై విచారణ నిర్వహించకుండా హుండీ ఆదాయం ఏ విధంగా లెక్కిస్తారని ప్రశ్నించారు. విచారణకు, హుండీ లెక్కింపునకు ఎటువంటి సంబంధం లేదని అధికారులు తెలిపినప్పటికీ పాలకవర్గం ససేమిరా అనడంతో ఉద్రిక్తత నెలకొంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యగా ఎస్సై యూవీ శివనాగబాబు సిబ్బందితో ఆలయం వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. విషయం తెలుసుకున్న మండలం సచివాలయ కన్వీనర్ దాసరి రమేష్, వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్ ఆలయం వద్దకు చేరుకుని అధికారులు, పాలకవర్గం సభ్యులతో మాట్లాడారు. మధ్యాహ్నం వరకు చర్చలు జరిగాయి. దీంతో హుండీ ఆదాయం లెక్కింపునకు, ఆ సొమ్మును బ్యాంకులో డిపాజిట్ చేసేందుకు తగిన సమయం లేకపోవడంతో హుండీ ఆదాయం లెక్కింపును తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు దేవదాయశాఖ అధికారులు ప్రకటించారు. దేవస్థానంలో అక్రమాలపై విచారణ నిర్వహించాలని ఆయనకు పాలకవర్గం సభ్యులు వినతిపత్రం అందజేశారు.